ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 25 ఫిబ్రవరి 2025

వెంబడించిన కుక్కలు.. దుప్పి మృతి

మహాముత్తారం, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): కుక్కల తరమడంతో దుప్పి మృతి చెం దిన సంఘటన మండ లంలోని పెగడపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. అటవీ ప్రాంతం నుంచి తప్పించుకొని వచ్చిన దుప్పి కుక్కలు తరమడంతో గ్రామంలోకి వచ్చింది. గ్రామస్థులు కుక్కల బారి నుంచి దుప్పిని కాపాడి ఫారెస్టు రేంజర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులకు అప్పగించారు. అధికారులు దానికి చికిత్స అందించే క్రమంలోనే మృతి చెందింది. దీంతో మహాముత్తారం ఇన్‌చార్జి పశువైద్యుడు ధీరజ్ అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కలు చాలా సేపు తరమడంతో దుప్పి గుండెపోటుకు గురై చనిపోయిందని వైద్యుడు తెలిపారు.



'ఎమ్మెల్సీ' ప్రచారానికి నేటితో తెర

వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ స్థానానికి 27న పోలింగ్

- బరిలో 19మంది అభ్యర్థులు.. 76 పోలింగ్ బూత్‌లు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,355మంది ఓటర్లు
- ఎవరికీ మద్దతివ్వని కాంగ్రెస్, బీఆర్ఎస్

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి మంగళవారం తెరపడబోతోంది. దీంతో 27వ తేదీన జరగబోయే ఊలింగ్‌పై ఉపాధ్యాయ సంఘాల నాయకులు దృష్టిపెట్టనున్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం బరిలో మొత్తం 19మంది అభ్యర్థులు ఉండగా.. పది రోజులుగా వివిధ ఉపాధ్యాయ సంఘాలు, స్వతంత్రులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అలాగే బీజేపీ నేతలు కూడా తమ అభ్యర్థి తరఫున ప్రచార పర్వం కొనసాగించారు. ఎన్నికల పోలింగ్‌కు 48గంటల ముందే ప్రచారాన్ని నిలిపి వేయాల్సి ఉండటంతో మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి ప్రచారానికి తెరపడబోతోంది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 76 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

జోరుగా ప్రచారం

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. బరిలో 19 మంది అభ్యర్థులు ఉన్నప్పటికి ప్రధానంగా ఆరుగురి మధ్యే పోటీ ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవతుఉన్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్సీ యూటీఎఫ్ మద్దతులో బరిలో దిగుతున్న అలుబెల్లి నర్సిరెడ్డి, టీచర్ జేఏసీ బలపరిచిన, కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డి, పీఆర్‌టీయూ అభ్యర్థిగా పింగిళి శ్రీపాల్‌రెడ్డి, టీసీ సంఘాలు బలపరిచిన మాజీ ఎమ్మెల్సీ పూల రవిందర్, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సుందరాజ్‌యాదవ్‌మధ్య ప్రధాన పోటీ ఉంటుందనే చర్చ జరుగుతోంది. వీరితోపాటు మరో 13మంది బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అయితే బీజేపీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డి తరుపున కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ జాతీయ నేతలు ఈటల రాజేందర్, డీకే. అరుణ తదితరులు ప్రచారం నిర్వహించారు. 20మందికి ఒక ఇంచార్జీ చొప్పున నియమించి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే టీచర్ జాక్ అభ్యర్థిగా బరిలో నిలిచిన గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డికి పరోక్షంగా కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందనే ప్రచారం జరుగుతుంది. గత రెండు, మూడు పర్యాయలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో హర్షవర్ధన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. మిగతా అభ్యర్థులు ఓటర్లను వ్యక్తిగతంగా కలవటంతో పాటు పలు అంశాలపై హమీలిస్తు ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఒక్క రోజే ప్రచారానికి సమయం ఉండటంతో అభ్యర్థులు ఎక్కువ మంది ఓటర్లను కలిసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ తటస్థ వైఖరి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్‌లు తటస్థత వైఖరిని

మిగతా 6వ పేజీలో...

- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డైట్ స్కీం నిర్వహణ
- బాధ్యతను మరచిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు
- లక్షలు దండుకుంటున్నా చర్యలు శూన్యం



భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జీజీహెచ్

ఆకలిని చంపేసే ప్లాన్

జీజీహెచ్‌లో రోగులకు నాణ్యత లేని భోజనం

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న పేదలకు నాణ్యమైన భోజనం అందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన డైట్ ప్లాన్ పక్కదారి పడుతోంది. భూపాలపల్లిలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో రోగులకు అందిస్తున్న భోజనం నాసిరకంగా ఉంటోందనే ఆరోపణలు వస్తున్నాయి. లక్షలు వెచ్చించి ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నా లక్ష్యం నెరవేరడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

నెలకు రూ. 4 లక్షల ఖర్చు

భూపాలపల్లి పీహెచ్‌సీ నుంచి జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్ అయిన ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో గత ఏడాది ప్రభుత్వం భోజన పథకాన్ని ప్రారంభించింది. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా కొత్త డైట్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ప్రతి రోజూ వంద మందికి ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్నం, రాత్రి పూట భోజనం అందించాల్సిన బాధ్యతను డైట్ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఇందుకోసం ప్రతి నెల రూ.4 లక్షలు చెల్లిస్తోంది.

నాణ్యత లేక..

జీజీహెచ్‌లో ప్రతిరోజూ 100 మందికి పైగా రోగులకు ఉచితంగా అందిస్తున్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. రోగులకు ఉదయం 7 గంటలకు టిఫిన్, మధ్యాహ్నం ఒంటి గంటకు, రాత్రి 7 గంటల వరకు భోజనం అందిస్తారు. ఈ భోజనంలో పోషక విలువలను పాటించాల్సి ఉంటుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ, పొంగల్, కిచిడీ, ఉప్మా అందించాల్సి ఉంటుంది. మధ్యాహ్నం, రాత్రిళ్లు అందించే భోజనంలో అన్నంతోపాటు పాలు, ఆకుకూరలు, అరటిపండ్లు, పల్లీ పట్టి, ఉడకబెట్టిన పల్లీలను రోగులకు అందించాలి. రోజుకు 395 గ్రాముల కార్బొహైడ్రేట్స్, 74.2 గ్రాముల ప్రొటీన్స్, 51.7 గ్రాముల కొవ్వు పదార్థాలు, 2,342 గ్రాముల క్యాలరీస్‌తో కూడిన భోజనం అందించాల్సి ఉంటుంది. అయితే.. ఆ కాంట్రాక్టు సంస్థ ఇవన్నీ పట్టించుకోకుండా నాసిరకంగానే భోజనం అందిస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

పరిమాణం సరిగా ఉండక..

జీజీహెచ్‌లో ప్రతి రోజూ వంద మంది రోగులతో పాటు వారితో ఉండే సహాయకులు ఎస్సీ, ఎస్టీల సామాజికవర్గానికి చెందిన వారైతే, వారికి కూడా భోజనం అందిస్తుంటారు. అయితే.. ఈ భోజనంలో కాంట్రాక్టు సంస్థ ఎలా ంటి నిబంధనలు పాటించడంలేదని తెలుస్తోంది. రోగులకు భోజనంతో పాటు ఇస్తున్న పాలు నాసిరకంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు పల్లీ పట్టీలు, ఉడకబెట్టిన పల్లీలను కూడా సరిగా ఇవ్వడం లేదని తెలుస్తోంది. నాసిరకం బియ్యాన్నే కాంట్రాక్టర్ వినియోగిస్తున్నట్లు సమాచారం. దీంతో పాటు క్యాలరీస్‌తో కూడిన కూరలను రోగులకు వడ్డించడం లేదని తెలుస్తోంది. దీంతోపాటు పాటు రోగులకు ఇస్తున్న చిక్కీలు కూడా నాసిరకంగానే ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

డాక్టర్‌దే డైట్ కాంట్రాక్టు?

ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్ జీజీహెచ్‌లో డైట్ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. జీజీహెచ్ డాక్టర్ భర్తే డైట్ వ్యవహారం వెలగబెడుతుండటంతో నాణ్యతా ప్రమాణాలు గాలికి పెట్టిన దీపంగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రతినెల డైట్ నిర్వహణకు ప్రభుత్వం రూ. 4లక్షల ఖర్చు చేస్తోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు నాణ్యమైన భోజనం అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం డైట్‌ను ప్రారంభిస్తే కాంట్రాక్టర్ మాత్రం దానిని నీరుగారుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆస్పత్రి డైట్ అధ్వానంగా ఉండటంతో వెలుపల ప్రొఫెసర్ జయశంకర్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న భోజనాన్ని రోగులు తెప్పించుకుంటున్నట్లు సమాచారం. జీజీహెచ్‌లో రోగులకు అందుతున్న డైట్‌పై సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.



జీజీహెచ్‌లో రోగులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది



అన్నం సరిగా పెట్టడం లేదు

ఆస్పత్రిలో భోజనం సరిగా ఉండటం లేదు. నాణ్యతలేనిది అందిస్తున్నారు. అరటిపండ్లు, పల్లీ పట్టీలు ఇవ్వడం లేదు. ఒట్టి అన్నంతోనే సరిపెడుతున్నారు. భోజనం పెట్టే సిబ్బంది ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు.

\- జాడి సరోజన, భూపాలపల్లి



రైతులను పట్టించుకోరా?

యాసంగి పంటకు సాగునీరు అందించాలి

- వారి కష్టాలు చూడకుండా ఎన్నికల ప్రచారానికెళ్తారా?
- సీఎంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్
- వరికి బోనస్.. ఓ బోగస్ అంటూ వ్యాఖ్యలు
- మానుకోట జిల్లాలో పర్యటన

6

కేసముద్రం మార్కెట్లో మిర్చి రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వర్తించాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వర్తించాలని అధికారు లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈనెల 27న జరిగే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో కాటారం, భూపాలపల్లి పీవో, ఏపీవోలకు రెండోవిడత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది పోలింగ్‌కు ఒక రోజు ముందే కేంద్రాలకు చేరుకొని ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని పరిశీలించి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 26న కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటుచేసి పోలింగ్ సామగ్రిని అందజేస్తామన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల విధులు నిర్వర్తించాలన్నారు. ఏదైనా పొరపాటు జరిగితే ఎన్నికల సంఘం ఆదేశాలనుసారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావే శంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మ యాంక్‌సింగ్, భూపాలపల్లి ఆర్డీవో రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

నేటి నుంచి అమల్లోకి సైలెన్స్ పీరియడ్

ఈనెల 27న జరుగనున్న పట్ట భద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్ని కల పోలింగ్ దృష్టిలో పెట్టుకొని మంగళవారం (ఈనె25న సాయంత్రం 4గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు సైలెన్స్ పీరియడ్ అమల్లోకి రానున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అన్ని రకాల ప్రచారాలు ముగించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికేతరులు జిల్లాను విడిచి వెళ్లాలని సూచించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రాజు (ఫైల్)


మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పంట దిగుబడి రాక, తెచ్చిన అప్పులు తీర్చలేక ఓ రైతు తన చేను వద్దే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై బి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన అరికాంతపు రాజు(38) తనకున్న మూడెకరాల్లో పత్తి, మిర్చి పంటలు సాగుచేస్తున్నాడు. ప్రతి ఏటా పంటలు ఆశించిన దిగుబడి రాకున్నా పెట్టుబడి కోసం అప్పులు తెచ్చి సాగుచేస్తున్నాడు. ప్రస్తుతం అతడికి సుమారు రూ.25లక్షల వరకు అప్పు ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. తెచ్చిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెందిన ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి మిర్చిపంటకు నీళ్లు పెట్టి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లాడు. సోమవారం ఉదయం కుటుంబసభ్యులు మిర్చిపంట దగ్గరికి వెళ్లి చూసేసరికి తాను కట్టుకున్న లుంగీతో వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి

ఒక్కరిపై కేసు నమోదు

టేకుమట్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని అంకుషాపురంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమన్‌పల్లికి చెందిన మారెపెల్లి రాజకొమరయ్య (65) టేకుమట్లకు నడుచుకుంటూ వెళ్తుండగా అంకుషాపూర్‌లో అదే గ్రామానికి చెందిన బిక్కనూరి సతీష్ ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొన్నాడు. దీంతో రాజకొమరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 అంబులెన్స్ ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య సమక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

గోదావరిలో పడి వృద్ధుడి మృతి



పంజల రామయ్య మృతదేహం

మహదేవపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గోదావరిలో సోమవారం వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. గ్రామస్థులు తెలిపిని వివరాల ప్రకారం.. చిట్యాల మండలం నవాబుపేట గ్రామానికి చెందిన పంజల రామయ్య (75) ఆదివారం రాత్రి కాళేశ్వరం చేరుకుని తెల్లవారేసరికే గోదావరిలో శవమై తేలాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై తమాషారెడ్డి సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. రామయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన రామయ్య తిరిగి రాలేదని, అతడి ఆచూకీ కోసం వెతుకుతున్నామని తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'చిన్న కాళేశ్వరం' భూసేకరణపై గ్రామసభలు



వీరాపూర్ గ్రామసభలో ఎస్‌డీసీ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

కాటారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్, జాదరావుపేట గ్రామపంచాయతీల పరిధిలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టే రిజర్వాయర్ల బండ్ విస్తరణ, కాల్వల నిర్మాణం కోసం భూసేకరణపై సోమవారం గ్రామసభలు నిర్వహించారు. కాటారం సబ్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ విభాగం) మయాంక్‌సింగ్ నేతృత్వంలో ఇరిగేషన్, సర్వే, రెవెన్యూ అధికారులు వీరాపూర్, రఘుపల్లి గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరాపూర్‌లో 22 ఎకరాల 4గుంటలు, రఘుపల్లిలో 11గుంటల భూసేకరణ కోసం విడుదల చేసిన ప్రిలిమనరీ నోటిఫికేషన్ (పీఎన్) చదివి వినిపించారు. భూములు కోల్పోతున్న రైతుల నుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించారు. వీరాపూర్ గ్రామసభలో పలువురు రైతులు కట్టను విస్తరించడంతో గ్రామంలోకి నీరు వచ్చే ప్రమాదం ఉంటుందని, పాములు, తేళ్లు లాంటి విషపురుగులు ఇళ్లలోకి చేరుతాయని, నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. 1976లో వీరాపూర్ శివశంకర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోతే పరిహారం అందిన భూములకే మళ్లీ పరిహారం ఇచ్చే జాబితాలో ఆ రైతుల పేర్లు ఉన్నాయ న్నా రు. ప్రస్తుతం భూములు కోల్పోతున్న అసలైన వారి పేర్లు పరిహారం జాబితాలో లేవని అభ్యంతరాలు తెలిపారు. తమ భూముల విస్తీర్ణం ఎక్కువగా ఉంటే తక్కువగా నమోదైందని తెలిపారు. గతంలో ఏయే సర్వే నంబర్ల భూములకు పరిహారం అందించారో వివరాలు తెలపాలని మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, పలువురు రైతులు కోరగా ప్రస్తుతం తమ వద్ద అవి లేవన్నారు. గ్రామ సభల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ నాగరాజు, ఏఈఈ వెంకన్న, ఆర్ఐ వెంకటయ్య, సర్వేయర్ వినయ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తునికాకు టెండర్లు షురూ..

కాకతీయఖని, ఫిబ్రవరి 24 ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి తునికాకు యూనిట్ల టెండర్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్ఎం డోబ్రియాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి రౌండ్ ఈ నెల 24న ఎర్నియెస్ట్ మనీ డిపాజిట్ (ఈడీఎం) ప్రక్రియ ప్రారభమై 25న ముగుస్తుందని, 27న ఆన్‌లైన్ సబ్మిషన్ ప్రారంభమై 28న ముగుస్తుందని వివరించారు. 28న సాయంత్రం 5 గంటలకు టెండర్స్ ఓపెనింగ్ ఉంటుందని తెలిపారు. అలాగే రెండో రౌండ్ మార్చి 6న ఈడీఎం ప్రారంభమై 7న ముగుస్తుందని, ఇందులో మొదటి రౌండ్‌లో విక్రయం కాగా మిగిలిన యూనిట్లకు టెండర్లు వేస్తారని పేర్కొన్నారు. 10న ఆన్‌లైన్ సబ్మిషన్, 11న ముగుస్తుందని, 11న సాయంత్రం 5 గంటలకు టెండర్స్ ఓపెనింగ్ ఉంటుందని తెలిపారు. అలాగే మొదటి, రెండో రౌండ్‌లో అమ్ముడు పోగా మిగిలిన యూనిట్లకు మార్చి 17న ఈడీఎం ప్రారంభమై 18న ముగుస్తుందని, 20న ఆన్‌లైన్ సబ్మిషన్ ఉంటుందని, 21న ఆన్‌లైన్ సబ్మిషన్‌కు చివరి గడువు అని, అదేరోజు సాయంత్రం 5 గంటలకు టెండర్స్ ఓపెనింగ్ ఉంటుందని వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తంగా 30 తునికాకు యూనిట్లు ఉన్నాయి. వీటిలో భూపాలపల్లి డివిజన్ పరిధిలో 16, మహదేవపూర్ డివిజన్ పరిధిలో 14 యూనిట్లు ఉన్నాయి.

రైతులను పట్టించుకోరా?

- యాసంగి పంటకు సాగునీరు అందించాలి
- వారి కష్టాలు చూడకుండా ఎన్నికల ప్రచారానికెళ్తారా?
- సీఎంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్
- వరికి బోనస్.. ఓ బోగస్ అంటూ వ్యాఖ్యలు
- ఆటో డ్రైవర్లకు రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్
- మానుకోట జిల్లాలో పర్యటన
- కేసముద్రం మార్కెట్‌లో రైతులతో మాటామంతి



కేసముద్రం మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

మహబూబాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి, పసుపు పంటలకు ధరలు పడిపోయి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటునే వారిని పట్టించుకోకుండా, కష్టాలను చూడకుండా ముఖ్యమంత్రి రేవంత్ ఎమ్మెల్సీ ప్రచారం కోసం నిజామాబాద్ వెళ్లారని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించిన ఆమె జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో రైతులందరూ కన్నీళ్లు పెడుతున్నారని ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని ఒప్పించి మిర్చిపంటకు మద్దతు ధర తెచ్చేందుకు కృషి చేస్తుంటే.. తెలంగాణ సీఎం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ ఢిల్లీకి వెళ్లి మద్దతు ధర కోసం పోరాటం చేయాలన్నారు. మిర్చికి పెట్టుబడి ఎక్కువ అవుతుందని, మిర్చి క్వింటాకు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరికి రూ.500 బోనస్ అంటూ ప్రకటించారని, అది ఓ బోగస్‌గా మారిందని విమర్శించారు. రైతుభరోసా ఎంత వస్తుందో తెలియడం లేదని, రైతు భరోసాతో పాటు రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో ఏ గ్రామంలో ఇవ్వలేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక్క కుటుంబంలో నలుగురికి భూమి ఉంటే అందరికీ రైతుబంధు, రైతుబీమా అమలు చేశారన్నారు. మహబూబాబాద్ జిల్లా వెనుకబడిన జిల్లా అని, జిల్లాగా మార్చడానికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని, కేసీఆర్ హయాంలోనే మహబూబాబాద్ జిల్లాకు మహర్దశ వచ్చిందని చెప్పారు. నాడు ఎస్డీఎఫ్ ఫండ్ కింద రూ.300 కోట్లు ఇచ్చామని, ప్రభుత్వం మారడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు.

వరద బాధితులకు నష్టపరిహారం ఏదీ?

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని సీతారాంతండాలో వరదలు వచ్చి బాధితులు నష్టపోయి నెలలు గడుస్తున్నా నేటికి వారికి ఎందుకు పరిహారం అందలేదని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. సీఎం ఆ గ్రామానికి విహారయాత్రకు వచ్చినట్లు వచ్చి వెళ్లిపోయారే తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన సొంత ఖర్చుతో ఓ లారీ సరుకులు తీసుకువచ్చి సీతారాంతండాలో పంపిణీ చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళలకు ఫ్రీ బస్సు అని పెట్టారని, అయితే దివ్యాంగులు, పురుషులు కూర్చునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. ఫ్రీ బస్సు వల్ల ఆటో కార్మికులు ఆదాయం కోల్పోయారని, వారికి తక్షణమే రూ.12వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఆకేరు వరదతో ఇతర చెరువులు తెగి కొట్టుకుపోయాయని, అనేక పొలాల్లో ఇసుక మేటలు వేసి రైతులు నష్టపోయారని చెప్పారు. తెగిపోయిన చెక్‌డ్యాంలకు ఇంత వరకు మరమ్మతులు చేయలేదన్నారు. ప్రస్తుతం యాసంగిలో సాగునీరు రాక రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని, పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ముఖ్యమంత్రి పక్కనే తిరుగుతున్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సొంత జిల్లావారేనని సాగునీరు అందించాలన్నారు. మిర్చి ధరలు పడిపోతున్నా ప్రభుత్వానికి సోయిలేకుండా పోయిందని, ఎకరా మిర్చికి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నా నామమాత్రపు ధరలు వస్తున్నాయని, క్వింటా మిర్చికి రూ.25వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో మిర్చి రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, కురవి మండలానికి చెందిన యువ రైతు బాలకిషన్ మృతి చెందితే తాము పరామర్శించామన్నారు. ముఖ్యమంత్రి రాజకీయాలను పక్కనపెట్టి మిర్చితో పాటు పసుపు రైతులను ఆదుకోవాలని కోరారు. మేడిగడ్డ కుంగిందని చెబుతున్న ముఖ్యమంత్రి స్టేజ్-2కు నీళ్లు ఇవ్వలేకపోయారని, గతేడాది ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోవడంతో ఎండిపోయాయని చెప్పారు. ఈ వేసవిలో నీరు ఇవ్వకుంటే పంటలకు సాగునీరు లేక ఎండిపోయే పరిస్థితి వస్తుందని, దీంతో పాటు తాగునీటికి కూడా ఇబ్బంది అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్.రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, చంద్రావతి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, మార్కెట్ మాజీ చైర్మన్లు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి రంగారావు, మార్నేని వెంకన్న, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, నాయిని రంజిత్, మహబూబ్ పాషా, ఎండి.ఫరీద్, నీలం దుర్గేష్, యాకూబ్‌రెడ్డి, ముత్యం వెంకన్న, ఎడ్ల వేణు, బూర్ల ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ కాళ్లుపట్టుకొనైనా మిర్చి రైతులను ఆదుకోవాలి

- రైతుల సమస్యలు సీఎంకు విన్నవించే సమయం 'వేం'కు లేదా
- కేసముద్రం మార్కెట్ సందర్శనలో ఎమ్మెల్సీ కవిత

కేసముద్రం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో మద్దతు ధర లేక మిర్చి రైతులు నష్టపోతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి మోదీ కాళ్లు పట్టుకొనైనా మద్దతు ధర కల్పించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్లో మిర్చియార్డును సోమవారం సాయంత్రం ఆమె సందర్శించారు. మిర్చి రైతులతో మాట్లాడి ఎంత అయిన పెట్టుబడి, గతేడాది పలికిన, ప్రస్తుతం పంటకు పలుకుతున్న ధర, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతఏడాది రూ.25వేల క్వింటా అమ్మిన మిర్చి ఈసారి రూ.11వేలకు పడిపోయిందని అన్నారు. మిర్చి రైతులు కష్టాలు, నష్టాల గురించి సీఎం కు చెప్పే సమయం స్థానిక నేత వేం నరేందర్‌రెడ్డికి లేదా? ఆయన నిత్యం సీఎంతోనే తిరుగుతుంటారని మండిపడ్డారు. కేసీఆర్ అప్పుడు నీళ్లిచ్చినప్పుడే పంటలు బాగా పండి సంతోషంగా ఉన్నారని, ఇక్కడ వాగు ఎండిపోతున్నా నీళ్లిచ్చే తెలివిలేని ప్రభుత్వమని విమర్శించారు. కేసీఆర్ మీద కోపంతో ఆయన కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని చెప్పేందుకు నీళ్లు బంద్ చేశారని ఆరోపించారు. రైతులతరపున పోరాటంచేయడానికి కేసీఆర్ సైనికులుగా తామంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఆమె వెంట ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, నీలం దుర్గేష్, మాజీ ఎంపీపీ వోలం చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కవిత సందర్శించే సమయంలో మిర్చి కాంటాలు జరుగుతుండటంతో కారం ఘాటుకు కవితతో పాటు అక్కడున్న వారంతా ఇబ్బందులు పడ్డారు. కొందరు నేతలు, కార్యకర్తలు మిర్చి ఘాటు కారణంగా యార్డు బయటే ఉన్నారు.

జేబుదొంగల చేతివాటం..

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన పర్యటనలో తొలుత అమీనాపురం వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించుకున్నారు. కవితను చూసేందుకు దేవాలయానికి భారీ ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. ఈ క్రమంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పలువురు మాజీ సర్పంచులు, నాయకుల జేబుల్లోంచి నగదు అపహరించగా.. ఓ నాయకుని మొబైల్ ఫోన్‌ను దొంగిలించారు. ఈ విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

వెంకటాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో నాలుగు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలను ఎస్సై రాజ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి తారతమ్యాలు లేకుండా క్రీడా దృక్పథంతో పోటీతత్వాన్ని కనబరచాలన్నారు. గెలుపు, ఓటములు సర్వసాధారణమని, ఓటమి గెలుపునకు నాంది పలుకుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, నాగారం మాజీ సర్పంచ్ ఆదినారాయణ, సొసైటీ సీఈవో సత్యనారాయణ, నాయకులు దాట్ల వాసుబాబు, కాకర్లపూడి కల్యాణ్, గ్రామపెద్దలు ఆలం శీతాలు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్



కృష్ణానగర్‌లో బాలకుమారస్వామికి పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

బాలకుమారస్వామికి మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు

గంగారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : గంగారం మండలం మడగూడెం పంచాయతీలో కొలువైన చుంచ వారి ఇలవేల్పు బాలకుమారస్వామికి పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. చుంచ వంశస్థులు బాలకుమారస్వామిని ఆదివారం రాత్రి గద్దెపైకి తీసుకువచ్చిన తర్వాత మంత్రి సీతక్క దర్శించుకున్నారు. తొలుత మంత్రి సీతక్కను గిరిజనులు వారి సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడారం సమ్మక్క ఆలయానికి ఉప ఆలయాలైన గిరిజన దేవాలయాలకు సమ్మక్క సారలమ్మ ట్రస్ట్ నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. గిరిజనులు ఆరాధించే వనదేవతలకు గద్దెలు కట్టేందుకు తనవంతు కృషి చేస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాడి వెంకన్న, జున్ను అశోక్ పూజారులు చుంచ శ్రీను, పెండకట్ల బుచ్చిరాములు, చంద్రయ్య, ఎర్రయ్య, సారయ్య, వెంకటేశ్వర్లు, యాప అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అభ్యున్నతికి పాటుపడాలి

- ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్



డిపోలో అధికారులతో మాట్లాడుతున్న ఈడీ ఖుస్రోషాఖాన్

తొర్రూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధికి కార్మికులు అన్ని విధాలా కృషి చేయాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ అన్నారు. తొర్రూరు డిపో మేనేజర్ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డిపో అభివృద్ధికి కార్మికులు అన్ని విధాలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల డిపోలో నిర్వహించిన పవర్ ట్రైనింగ్ ప్రోగ్రాంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిభ కనబర్చిన కార్మికులను అభినందించారు. వరంగల్ రీజియన్ పరిధిలో తొర్రూరు డిపో ముందంజలో ఉండాలని సూచించారు. జోన్ పరిధిలోని డిపోల్లో వార్షిక సమావేశంలో భాగంగా అధికారులతో సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, డిప్యూటీ ఆర్ఎం మాధవరావు, కరీంనగర్ జోన్ సీఐ బోయేజ్‌కుమార్, డీఎం పద్మావతి, ఎంఎఫ్ విజయ్‌కుమార్, ఎస్టీఐ రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆ ముగ్గురి కోసం..

ముమ్మర గాలింపు

- రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : సామాజిక కార్యకర్త నాగవెళ్లి రాజలింగమూర్తి హత్య కేసులో పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేసిన విషయం విదితమే. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా పోలీసులు వారి కోసం రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఫోన్ కాల్స్ ఆధారంగా ఇంకా లోతుగా విచారణ జరుపుతూ అనుమానితుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. ఈ హత్య కేసులో ప్రధానంగా బీఆర్ఎస్ నేత, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు హస్తమున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆయన్ను ఏ8గా చేర్చారు. ఆయన పరారీలో ఉన్నట్లు స్వయంగా ఎస్పీ ప్రకటించడంతో జిల్లాలో తీవ్ర చర్చ సాగుతోంది. మరోవైపు హరిబాబు కోసం పోలీసులు ఆయన నివాసముండే ప్రాంతాలపై నిఘా ఉంచినట్లు తెలిసింది. ఆయనతో పాటు ఏ9 నిందితుడు పుల్లా నరేష్, ఏ10 నిందితుడు పుల్లా సురేష్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ డబ్బులు

- విడుదల చేసిన ప్రధాని మోదీ
- 19వ దఫాలో తొలి విడతగా రూ.2వేల చొప్పున జమ



హనుమకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకంలో భాగంగా 19వ విడత నగదు రూ.2వేల చొప్పున ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విడుదల చేశారు. సోమవారం బిహార్‌లోని భాగల్‌పూర్‌లో 9.80కోట్ల మంది రైతుల రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లాలో 55వేల మంది రైతులకు రూ.11 కోట్లు, వరంగల్ జిల్లాలో 61,031 మంది రైతులకు రూ.12.2 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 42వేల మంది రైతులకు రూ.8.4కోట్లు జనగామ జిల్లాలో 53,400 మంది రైతులకు రూ.10.68కోట్లు, ములుగు జిల్లాలో 29,795 మందికి రూ.5.95 కోట్లు విడుదలయ్యాయి.

కిందటేడు అక్టోబర్ 3న మహారాష్ట్రలోని వాషిమ్ వేదికగా ప్రధాని మోదీ 18వ విడత నగదును విడుదల చేశారు. అప్పుడు కూడా దాదాపు ఇంతే మొత్తం రైతుల ఖాతాల్లో జమ అయింది. అయితే ఈ సారి మరికొంత మందికి కూడా పీఎం కిసాన్ సమ్మాన్ యోజన వర్తించినట్టు సమాచారం. విరాసత్, తదితర కారణాల వల్ల పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందని వారికి ఇప్పటివరకు సమ్మాన్ నిధులు అందలేదు. ఈ సారి కొత్తగా పాస్‌పుస్తకాలు పొందినవారికి కూడా కిసాన్ డబ్బులు ఇవ్వనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కొత్తపట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వారు ఉమ్మడివరంగల్ జిల్లాలో 15వేల మంది వరకు ఉండవచ్చునని అంచనా. వారందరికీ 19వ విడత కిసాన్ సమాన్ నిధులు ఖాతాల్లో పడ్డట్టు తెలుస్తోంది. కిసాన్ సమ్మాన్ యోజన కింద యేటా మూడు విడతలుగా రూ.6వేల చొప్పున రైతులకు అందుతాయి. ఇందులో మొదటి విడతగా రూ.2వేలు సోమవారం జమకాగా, రెండో విడత జూన్‌లో, మూడో విడత అక్టోబర్‌లో విడుదలవుతాయి. 2019లో పథకం ప్రారంభమైంది.

ఆన్‌లైన్‌లో ఇలా చూసుకోవచ్చు..

ప్రదాన మంత్రి కిసాన్ యోజన కింద తమ ఖాతాల్లో డబ్బులు పడిందిలేనిది రైతులు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. రైతులు తమ గ్రామం, జిల్లా, రాష్ట్రం ఆధారంగా పీఎం కిసాన్ యోజన లబ్ధిదారుల జాబితాను రూపొందించింది. దీనిని సులభంగా తనిఖీ చేసుకోవచ్చు. పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్ https://pmkisan.gov.in/ సందర్శించాల్సి ఉంటుంది. ఆ తర్వాత నో యువర్ స్టేటస్‌పై క్లిక్ చేయాలి. అక్కడ లబ్ధిదారుడి పేరు మీద నమోదు చేసిన రిజిస్ట్రేషన్ నెంబర్, క్యాప్చా ఎంటర్ చేయాలి. ఆ తర్వాత అప్లయ్ చేసుకున్న సమాచారం కనిపిస్తుంది. జాబితాలో లబ్ధిదారుడి పేరు ఉంటే ఈ పథకం కింద ఆర్థిక సహాయం ఖాతాల్లో పడ్డట్టే. పీఎం కిసాన్ నిధి పథకం కింద అర్హత పొందాలంటే రైతు భారతీయ పౌరుడై ఉండాలి. చిన్న, సన్నకారు రైతు అయి ఉండాలి. నెలకు రూ.10వేల పెన్షన్ పొందే ఉద్యోగ విరమణ చేసిన వ్యక్తి కాకూడదు. ఆదాయపు పన్ను దాఖలు చేయకూడదు.

పది వేలు వేసేది ఎప్పుడు?

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద పెట్టుబడి సాయం రూ.6వేల నుంచి రూ.10 వేలకు పెంచుతున్నట్టు ప్రధాని మోదీ కొత్త సంవత్సరం కానుకగా ప్రకటించారు. ఈ మేరకు పెంచిన మొత్తంతో కలిసి డబ్బులు ఖాతాలో జమవుతాయని ఆశ పడిన అన్నదాతలకు నిరాశే మిగిలింది.

ఈ యేడు 19 విడత సాయం కింద రూ.6వేల చొప్పున మొదటి విడతగా రూ.2వేలనే వేశారు. పెట్టుబడి సాయం పెంచనున్నట్టు చేసిన ప్రకటన ఎప్పుడు అమలులోకి వస్తుందో అని ఎంతగానో ఆశ పడుతున్నారు.

మార్కెట్‌కు భారీగా మిర్చి రాక

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మార్కెట్‌కు సోమవారం 10వేల బస్తాలకు పైగా మిర్చి రాబడులు కొనసాగాయి. 8100 బస్తాల వరకు ఈ-నామ్ మార్కెట్‌లో వేలం పాటలు కొనసాగగా 2500 బస్తాల వరకు వేలం పాటలు కాకుండ నిలిచిపోయాయి. మిర్చి మార్కెట్‌కు అధిక రాబడులు కొనసాగడంతో జిల్లా మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు యార్డులోని మిర్చి రాబడులను పరిశీలించారు. ఆయన వెంట మార్కెట్ కార్యదర్శి శంషీర్ ఉన్నారు. సోమవారం మార్కెట్‌లో తేజరకం మిర్చి గరిష్టంగా రూ.14,171 ధర పలుకగా కనిష్టంగా 11,225లు ధర పలికింది. సగటున రూ.13119 ధర పలికింది.



మహబూబాబాద్ మార్కెట్‌లో మిర్చిని పరిశీలిస్తున్న జిల్లా మార్కెటింగ్ అధికారి

మావోయిస్టు పుల్సం పద్మ లొంగుబాటు

- దివంగత కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ భార్య.. స్వస్థలం ములుగు జిల్లా తుపాకులగూడెం



మావోయిస్టు పద్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ

ములుగు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ డీవీసీఎం పుల్సం పద్మ అలియాస్ ఊరే అలియాస్ గంగక్క సోమవారం ములుగు ఎస్పీ శబరీశ్ ఎదుట లొంగిపోయారు. 52 ఏళ్ల వయ సులో 27 సంవత్సరాల అజ్ఞాత జీవితాన్ని వదిలి ఆమె జనజీవన స్రవంతిలో కలిశారు. దీంతో ఎస్పీ ఆర్థిక సాయం అందించారు. పద్మ లొంగుబాటుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మీడియాకు వివరించారు. ములుగు జిల్లా తుపాకులగూడెం గ్రామానికి చెందిన పద్మ నిరుపేద ఆదివాసీ కుటుంబంలో జన్మించారు. పీడబ్ల్యూజీ సిద్ధాంతం పట్ల ఆకర్షితురాలైన ఆమె 1998లో దళంలో చేరి 2001 వరకు ఏటూరునాగారం దళసభ్యురాలిగా పనిచేశారు. ఆ తర్వాత మహిళా దళానికి బదిలీ అయిన పద్మ 2004 వరకు కొనసాగారు. 2005లో మహిళా దళం కమాండర్‌గా నియామకం పొందారు. అదే ఏడాది సెంట్రల్ కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్‌ను వివాహం చేసుకొని ఆయన రక్షణ విభాగానికి బదిలీ అయ్యారు. 2007 లో ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొందారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పలు హింసాత్మక సంఘటనల్లో పద్మ ప్రత్య క్షంగా పాల్గొన్నారు. రెడ్డిపల్లి ఈవోఎఫ్, నేషనల్ పార్కు, వెస్ట్ బస్తర్‌లో మూడుసార్లు జరిగిన ఎదురుకాల్పుల సంఘటనలో పాల్గొన్నారు. 2004లో ద్విచక్ర వాహనం పైనుంచి పడటంతో ఎడమ చేతికి గాయమైన ఆమె అనారోగ్య సమస్యలు పెరగడంతో లొంగుబాటును ఎంచుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత ఆధునిక యుగంలో డిజిటల్ విప్లవం, ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజాస్వామిక సంక్షేమ విధానాల కారణంగా మావోయిస్టుల సిద్ధాంతానికి ప్రాము ఖ్యత తగ్గిందని పేర్కొన్నారు. మిగతా మావోయిస్టు పార్టీ నాయకు లు లొంగిపోతే పునరావాసం కల్పిస్తామని, అన్ని విధాలా ఆదుకుం టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ గీతే మహేష్ బాబా సాహెబ్, డీఎస్పీ ఎన్.రవీందర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ' ప్రచారానికి నేటితో తెర

(5వ పేజీ తరువాయి)

అవలంభిస్తున్నాయి. ఆ పార్టీ మద్దతు దారులు పోటీలో ఉన్నా అధికారికంగా మద్దతు ప్రకటించటం లేదు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అయిన గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి టీచర్ జేఏసీ మద్దతుతో ఎమ్మెల్సీ బరిలో ఉన్నారు. ఈక్రమంలో కాంగ్రెస్ అభిమానులు పరోక్షంగా గాల్‌రెడ్డికి మద్దతుగా పనిచేస్తున్నట్టు సమాచారం. ఇక బీఆర్ఎస్ నేత, మాజీ వరంగల్ కూడా చైర్మన్ సుందరాజ్‌యాదవ్ కూడా టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉన్నప్పటికి గులాబీ పార్టీ ప్రత్యక్షంగానూ.. పరోక్షంగానూ మద్దతు ఇవ్వటం లేదు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తున్న బీఆర్ఎస్ బీసీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని బీసీ సంఘాల నేతలు కోరుతున్నప్పటికి గులాబీ అధిష్టానం ఏలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఉపాధ్యాయ సంఘాలతో ఒక్క బీజేపీనే ప్రత్యక్షంగా ఎన్నికల్లో పాల్గొంటోంది.

నేటితో ప్రచారం సమాప్తం..

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 4గంటలకు ముగబోనుంది. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు, 13వ తేదీ వరకు ఉపసంహరణ ఘట్టం పూర్తి కావటంతో 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. 48గంటల ముందే ప్రచారాన్ని బంద్ చేయాల్సి ఉండటంతో మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. ఈ సైలెన్స్ పీరియడ్‌లో సభలు, సమావేశాలు నిర్వహించటం నిషేదం. బల్క్ ఎస్ఎంఎస్‌లు, ఊరేగింపులు నిర్వహించకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టం చేసింది. ఎన్నికలు ముగిసే వరకు అన్ని జిల్లాల్లో 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 27వ తేదీన ప్రభుత్వం సెలవు కూడా ప్రకటించింది. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,355మంది ఓటర్లు ఉండగా, 76 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. వీరిలో పురుషులు 6,886, మహిళలు 4,469మంది ఓటర్లు ఉన్నారు. అయితే అధ్యధికంగా 5,215ఓట్లు హనుమకొండ జిల్లా, 2,352 ఓట్లు వరంగల్ జిల్లాలో ఉన్నాయి. అలాగే జనగామలో 1002 ఓట్లు, మహబూబాబాద్ జిల్లాలో 1,663మంది ఓటర్లు, ములుగు జిల్లాలో 628మంది, భూపాలపల్లి జిల్లాలో 329మంది, సిద్ధిపేట జిల్లాలో 166మంది ఓటర్లు ఉన్నారు. అయితే అత్యధిక ఓట్లు హనమకొండ, వరంగల్ నగరంలోనే ఉండటంతో అభ్యర్థుల ప్రచారం మొత్తం వరంగల్ కేంద్రంగా జరిగింది. పూర్వ కరీంనగర్ జిల్లా పరిధిలో ఉన్న భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహదేవపూర్, పలిమెల, మహముత్తారం, మల్హర్ మండలాల్లో ఉపాధ్యాయ ఓట్లు 83, పట్టభద్రుల ఓట్లు 2,483 ఉన్నాయి. అలాగే హనుమకొం డ జిల్లా పరిధిలోని కమలాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో ఉపాధ్యాయ ఓట్లు 166. పట్టభద్రుల ఓటర్లు 4,585 మంది ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 27వ తేదీన పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తుంది.


ఉదయం భూపాలపల్లిలో కురుస్తున్న మంచు

ఉదయం ఠండా.. మధ్యాహ్నం ఎండ

వాతావరణ పరిస్థితి విచిత్రంగా ఉంటోంది. పలు ప్రాంతాల్లో ఉదయం సమయంలో మంచు కమ్మేస్తూ చల్లగా ఉంటుండగా.. మధ్యాహ్నం మాత్రం ఎండ తీవ్రతకు మాడు పగులుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భిన్న వాతావరణ పరిస్థితులతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉదయం మంచు కారణంగా రహదారులు సక్రమంగా కనిపించక వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణిస్తుంటే.. మధ్యాహ్నం ఎండ తీవ్రతకు ప్రజలు వస్త్రాలు కప్పుకొంటున్నారు. గొడుగులను ఆశ్రయిస్తున్నారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి


మధ్యాహ్నం సమయంలో జన సంచారం తక్కువగా ఉన్న రోడ్డు



పంచ లింగాల క్షేత్రం ఓరుగల్లు

- చారిత్రక శివాలయాలు నెలకొన్న నగరం
- కాకతీయుల పూజలందుకున్న మహాదేవుడు

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సృష్టి స్థితి లయకారకుడైన పరమేశ్వరుడి పలు విభూదులలో పంచలింగ క్షేత్రాలు స్వయంభూగా వెలిశాయి. అందులో తమిళనాడు రాష్ట్రంలో పంచభూత లింగాల క్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పంచరామ క్షేత్రాలు, తెలంగాణలోని ఓరుగల్లు నగరంలో పంచముఖ లింగ క్షేత్రాలు స్వయంభూగా వెలిశాయి. దీంతో ఓరుగల్లు నగరం ఆధ్యాత్మిక క్షేత్రంగా పరిఢవిల్లుతోంది. పంచ లింగాల్లో ఒకటి ఖిలా వరంగల్ శంభులింగేశ్వర దేవాలయంలో వెలసిన పృథ్వీ లింగం కాగా, రెండోది మట్టెవాడలోని భోగేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న జలలింగం. మూడోది భద్రకాళి దేవస్థానంలో ఉన్న భద్రేశ్వరుడు అగ్ని లింగం (తేజో లింగం). నాలుగోది హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో ఉన్న వాయు లిం గం. ఇక ఐదోది కాజీపేట సమీపంలోని మెట్టుగుట్టపై వెలసిన ఆకాశ లింగం.


భద్రకాళి దేవాలయంలోని భద్రేశ్వరుడు

చారిత్రక శివాలయాలకు నిలయం

చారిత్రక శివాలయాలు వెలిసిన ఓరుగల్లు నగరంగా వరంగల్ చరిత్ర పుటల్లో నిలిచింది. శివ పూజలకు నిలయంగా నిలిచింది. బ్రాహ్మీ భూత సద్గురు కందుకూరి శివానందమూర్తి తన భక్తులతో శిష్య పరివారంతో ఈ ఐదు పంచలింగ క్షేత్రాలలో యజ్ఞ యాగ పూజాధికాలు నిర్వహించి తద్వారా వాటి మహత్యాన్ని భక్తులకు లభించే విధంగా తీర్చి దిద్దారు. కాశీ గంగ నుంచి కాశీబుగ్గకు నీటి బుడగ కంచి జగద్గురు పరమాచార్యులు కాశీబుగ్గలోని సహస్ర లింగాన్ని దర్శించి ఈ క్షేత్ర మహిమల గురించి వివరించారు. కాశీ నుంచి రామేశ్వరం మధ్య రేఖపై ఓరుగల్లు నగరం ఉందని.. కాశీ, రామేశ్వరం తర్వాత వరంగల్ నగరం కూడా గొప్ప క్షేత్రమని వెల్లడించారు. కాశీ నుంచి వరంగల్ నగరంలోని కాశిబుగ్గకు గంగా నది అంతర్వాహినిగా వచ్చి ఒక ప్రదేశంలో బుగ్గగా వెలసి బుడగలు బుడగలుగా గంగా జలం బయటకు వచ్చిందని, అందుకే ఆ ప్రాంతానికి కాశిబుగ్గ అనే పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు. శైవ ఆరాధనకు పెట్టింది పేరు ఓరుగల్లు అని, కాకతీయ రాజులు నిత్యం మహాదేవుడికి పూజలు చేసేవారని పూర్వీకులు చెబుతారు.

తిరువన్నామలై అనుసంధానంగా మాఢ వీధులు

శేషు, భద్రకాళి దేవస్థానం అర్చకుడు

తమిళనాడులోని అరుణాచలం (తిరువన్నామలై)లో అగ్ని లింగంగా ఉన్న పరమేశ్వరుడిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు తరలివస్తారు. గిరిప్రదక్షిణ చేసి స్వామి అనుగ్రహాన్ని పొందుతారు. అంతటి మహిమాన్వితమైన పంచముఖ లింగ క్షేత్రాల్లో ఒకటైన వరంగల్ భద్రకాళి క్షేత్రంలోని భద్రేశ్వరుడు అగ్ని లింగంగా భక్తులను అనుగ్రహిస్తాడు. అందుకే భద్రకాళి ఆల యం చుట్టూ మాఢ వీధులను ఏర్పాటు చేసి గిరిప్రదక్షిణ జరిగే విధంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. దీంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

రుద్రేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు


వేయి స్తంభాల ఆలయం (ఫైల్)



మీడియాతో మాట్లాడుతున్న గంగు ఉపేంద్రశర్మ, ఈవో అనిల్‌కుమార్

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల పర్వం మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 1వ తేదీ వరకు కొనసాగే వేయిస్తంభాల ఆలయ బ్రహ్మోత్సవ వివరాలను సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, ఈవో అనిల్‌కుమార్‌లు మీడియా సమావేశంలో వెల్లడించారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే వేడుకల్లో గణపతి పూజ, అంకురార్పణ, రక్షబంధనం లాంటి వైదిక కార్యక్రమాలను నిర్వహించి గణపతి నవగ్రహ మహాచండీ హవానాన్ని ప్రముఖ అధ్మాతిక వేత్త వద్దిరాజ వెంకటేశ్వర్ల దంపతుల సౌజన్యంతో నిర్వహిస్తామని ఉపేంద్రశర్మ చెప్పారు. అదే విధంగా బుధవారం మహాశివరాత్రి పర్వదన వేళ తెల్లవారు జామున 4గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహింపచేస్తామని చెప్పారు. అదేరోజు శివరాత్రి వేళ ఉదయం 11 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు నగరంలోని ప్రముఖ కూచిపూడి, భారతనాట్య కళాకారులతో ప్రత్యేక నృత్యాలు, అభినయ రుద్రనాట్యాలయం ఖమ్మం వారిచే నాట్యాచార్యుల ప్రణీల్ కణతాల ఆధ్వర్యంలో శిష్యబృందంతో భారతనాట్య ప్రదర్శనలు, బోడిగే లక్ష్మీనారాయణ బాగవత్‌చే శివపార్వతుల కల్యాణం, హరికథ కాలక్షేపం ఏర్పాటు చేశామని చెప్పారు. శివరాత్రి వేళ సాయంత్రం 6.30 గంటలకు రుద్రేశ్వరస్వామి కల్యాణోత్సవం, అర్ధరాత్రి 12 గంవటలకు లింగోద్భవ సమయంతో 11మంది వేద పండితులతో 50 లీటర్ల అవుపాలు, ఇతర సుగంధ ద్రవ్యాలతో రుద్రేశ్వరుడికి అభిషేకం చేస్తామని చెప్పారు.

ఈవో అనిల్ కుమార్ మాట్లాడుతూ.. మహాశివరాత్రికి భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీఐపీలు, పాత్రికేయుల కోసం క్యూలైన్, అభిషేకాలు చేయించుకునే భక్తులకు మరొకటి, సర్వదర్శనం భక్తులకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు స్వామి వారి కల్యాణంలో నిర్ణీత రుసుము చెల్లించి పాల్గొనవచ్చునని తెలిపారు ప్రత్యేక పోలీసు బందోబస్తు, జిల్లా యంత్రాంగం, మున్సిపల్ శాఖ సహకారం మంచినీటి సౌకర్యం, చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారంతో పండ్ల పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, రుద్రేశ్వర సేవా సమతి నిర్వాహకులు రావులు సుదర్శన్, చొల్లేటి కృష్ణమాచార్య, సీనియర్ అసిస్టెంట్ మధుకర్‌లు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో జాతరకు సర్వం సిద్ధం

నేటి నుంచి శివరాత్రి మహోత్సవాలు


విద్యుత్ వెలుగుల్లో కాళేశ్వరాలయం

మహదేవపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో వేంచేసిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో శివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రాష్ట్రాల సరిహద్దు, మూడు నదుల కలయిక, త్రిలింగాల్లో ఒకటైన కాళేశ్వర ముక్తీశ్వరుడికి పూజలు చేసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఈ క్షేత్రంలో 25, 26, 27 మూడు రోజుల పాటు కనుల పండువగా శివరాత్రివేడుకలు జరుగనుండగా మన రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, భక్తులు వేల సంఖ్యలో తరలొచ్చి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుంటారు. ఇక సరస్వతి అమ్మవారి దేవాలయాలు దేశంలోనే మూడు ఉండగా అందులో కాళేశ్వరం ఒకటి. ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈవో మహేష్ తెలిపారు. భక్తులకు క్యూలైన్లలో తాగునీరు, మజ్జిగ, పండ్లు, అందిస్తున్నామని, వైద్య శిబిరాలు, మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు గదులు, మరుగుదొడ్లతో పాటు చలువ పందిళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఈసారి మహాశివరాత్రి రోజున గోదావరి మాతకు హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇక కాళేశ్వరంలో జరిగే మహా శివరాత్రి జాతరకు ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు 250 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. వీఐపీ ఘాట్, గోదావరి ఘాట్, బస్టాండ్ తదితర ఏరియాల్లో ఈ బృందాలు విధులు నిర్వర్తిస్తాయని తెలిపారు.

అందుబాటులోకి ఆర్టీసీ సేవలు

కాళేశ్వరంలో జరిగే శివరాత్రి జాతరకు మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడిపిస్తునట్టు భూపాలపల్లి డీఎం తెలిపారు. భూపాలపల్లి, వరంగల్, పరకాల, జనగామ, మంథని, మంచిర్యాల, కరీంగనగర్, ఆసిఫాబాద్, హుజురాబాద్‌తో పాటు పలు డిపోల నుంచి భక్తుల కోసం స్పెషల్ సర్వీసులు నడుపుతున్నామన్నారు.

ముస్తాబైన కోటగుళ్లు, రెడ్డిగుడి



గణపేశ్వరాలయం


రెడ్డి గుడి

గణపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకతీయ కట్టడాలైన శ్రీ భవానీ సమేత గణపేశ్వరాలయం(కోటగుళ్లు), రెడ్డిగుడిలు శివరాత్రి శివ పార్వతుల కల్యాణ వేడుకలకు ముస్తాబయ్యాయి. ఏటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ పరిరక్షణ కమిటీల ఆధ్వర్యంలో ఈ కల్యాణం జరుగుతుంది. ఈ నెల 26న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అంతేకాకుండా కోటగుళ్లలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ముక్కంటి ఉత్సవాలకు రామప్ప ముస్తాబు

26 నుంచి 28 వరకు శివరాత్రి వేడుకలు


రామలింగేశ్వరస్వామి

వెంకటాపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'ముక్కంటి' ఉత్సవాలకు.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామ శివారులో గల యునెస్కో గుర్తింపు పొందిన సుప్రసిద్ధ కళాక్షేత్రం రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం ముస్తాబవుతోంది. 26, 27, 28 తేదీల్లో జరిగే వేడుకలకు పలురంగాల ప్రముఖులతో పాటు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో చలువ పందిళ్ల, తాగునీటి వసతి, క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే విద్యుత్, ఆర్టీసీ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎండోమెంట్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు.


నయనానందకరంగా నవరాత్రోత్సవాలు

ముస్తాబైన మెట్టురామలింగేశ్వరస్వామి క్షేత్రం


మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయం

మడికొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న స్వయంభూ శ్రీమెట్టురామలింగేశ్వరస్వామి క్షేత్రం మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. తొమ్మిది రోజుల పాటు కనులపండువగా జరుగనున్న వేడుకలకు ఆలయ గోపురాన్ని, దొంతులమ్మ గుండ్లను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. దొంతులమ్మ గుండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాలకు మడికొండ, నగరంలోని వివిధ డివిజన్లతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చి శివపార్వతుల కల్యాణ మహోత్సవ ఘట్టాన్ని కనులారా వీక్షిస్తారని, జాగరణ చేసే భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

కురవి శివరాత్రి ఉత్సవాలకు నేడు అంకురార్పణ


విద్యుద్దీపాల వెలుగులో కురవి వీరభద్రస్వామి ఆలయం

కురవి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వనదేవతలైన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర తర్వాతి స్థానంలో పేరు గడించిన గిరిజనుల ఆరాధ్యదైవమైన కురవి వీరన్న జాతరకు మంగళవారం రాత్రి 7గంటలకు అంకురార్పణ జరగనుంది. శివరాత్రి రోజైన 26నుంచి నెల రోజులపాటు కొనసాగే వీరభద్రస్వామి జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి దాదాపు 5 లక్షల మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా కురవి ఆలయం జాతర శోభను సంతరించుకోగా.. అధికారులు భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వీరభద్రుని కల్యాణం జరిగే నాగేంద్రస్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఆర్డీవో కృష్ణవేణి, తహ సీల్దార్ సునీల్‌రెడ్డి, ఆలయ ఈవో సత్యనారాయణ, ఇతర అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మహబుబాబాద్ రూరల్ సీఐ సరవయ్య, కురవి ఎస్ఐ గండ్రాతి సతీష్ సోమవారం క్యూలైన్ల ఏర్పాటు సహా జాతర బందోబస్తు ప్రక్రియను సమీక్షించారు. 25వ తేదీ మంగళవారం రాత్రి 7గంటలకు అంకురార్పణతో కురవి జాతర ప్రారంభంకానుండగా 26వ తేదీ బుధవారం తెల్లవారుజామున 1:00గంటకు జరిగే స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి సుమారు 2లక్షల మంది తరలిరానున్నారు. శివరాత్రి రోజు సాయంత్రం 7గంటలకు గ్రామసేవ, ఎదురుకోలు, రాత్రి 12.30కు భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి కల్యాణం జరగనుంది. వరంగల్, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు మహబూబాబాద్ వరకు రైళ్లు, బస్సుల్లో వచ్చి అక్కడి నుంచి 9కిలోమీటర్ల దూరంలో ఉన్న కురవికి చేరుకుంటారు. వారికి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్‌వాహనాలు అందుబాటులో ఉంటాయి.

మల్లన్న సన్నిధిలో కల్యాణశోభ

ప్రభుత్వం నుంచి కల్యాణానికి పట్టువస్త్రాలు అందజేత

ఐనవోలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం కల్యాణశోభను సంతరించుకుంది. బుధవారం ఉదయం 4 గంటలకు స్వామివారి మేలుకొలుపు సుప్రభాతసేవ ప్రథమయామ(ప్రాత:కాల) పూజతో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభం కానుండగా సింహవాహనసేవ, గవ్యాంతపూజలు, అష్టోత్తర శతకలశార్చన, మహన్యాసపూర్వక మహారుద్రాభిషేకం, రుద్రహోమాలు, బలిహరణం, 12 గంటలకు ఆలయం తూర్పు వైపున ఉన్న కాకతీయుల నృత్యమండపంలో ఒగ్గు పూజారులుతో పెద్దపట్నంవేయడం, శివతాండవ నృత్యాలు జరుగుతాయి. రాత్రి 9 గంటలకు భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండుగగా నిర్వహించనున్నారు. కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తిగీతాల ఆలాపన కార్యక్రమం జరగనుంది. ఆర్కెస్ట్రా బృందంచే రేలారేలారే, జానపద గేయాల కళాబృందంచేత ప్రదర్శనలు నిర్వహించనున్నారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతోపాటు టాకింగ్ డాల్స్ మిమిక్రీ నిర్వహించనున్నారు. కల్యాణానికి ప్రభుత్వం తరపున ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు పట్టువస్త్రాలను సమర్పిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపున్నారు.



విద్యుత్ కాంతుల నడుమ ఐనవోలు దేవస్థానం, మల్లికార్జునస్వామి

పెద్దపట్నంపై భక్తుల శివతాండవం ప్రత్యేకం

మల్లన్న స్వామికి అత్యంత ప్రీతికరమైన పెద్దపట్నాన్ని ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. వివిధ రకాల చూర్ణాలతో ముగ్గులు వేసి కాకతీయులు నిర్మించిన నృత్య మండపంలో 12 అడుగుల వెడల్పు పొడువుతో అందంగా పట్నం వేస్తారు. మధ్యలో స్వామి అమ్మవార్లను పూజించి అవాహనం చేసి ఒగ్గు కథ ద్వారా కల్యాణ గాథను పఠిస్తారు. తదుపరి భక్తి పరవశంతో పట్నంపై షైమరిచి శివతాండవం చేస్తారు. వందల సంఖ్యలో పెద్దపట్నంపై నృత్యాలు చేయడం కనువిందుగా నిలుస్తుంది. ఆ సమయంలో తొక్కిసలాట జరుగకుండా పోలీసులు బందోబస్తును నిర్వహిస్తారు.

నేటి నుంచి సోమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

ఐదు రోజుల వేడుకకు ముస్తాబైన పాలకుర్తి


సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రం

పాలకుర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాలో అతిపెద్ద పుణ్యక్షేత్రమైన సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి నుంచి ఐదు రోజుల పాలు వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసింది. 25న అంకురార్పన, ధ్వజారోహణ, 26న స్వామి వారల కళ్యాణ మహోత్సవం, 27న రథోత్సవం, బండ్లు తిరుగుట, 28 న డోలారోహణం, వసంతోత్సవం, పుష్పయాగం, మార్చి 1న అగ్ని గుండాలతో ఉత్సవాలు ముగుస్తాయి. సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నామని దేవస్థానం ఈవో మోహన్‌బాబు తెలిపారు. గుట్ట సమీపంలో భక్తులకు నిరంతర తాగు నీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాల ఏర్పాట్లు, గుట్ట పైన భక్తులు దర్శనానికి వచ్చే వారికి క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఇక వరంగల్, జనగామ, తొర్రూరు, సూర్యాపేట డిపోల నుంచి పాలకుర్తికి జాతర స్పెషల్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.


గుట్టపైకి వెళ్లే మెట్ల మార్గం, ఇన్‌సెట్‌లో గర్భగుడిలోని శివలింగం

మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలోని నగరేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఈనెల 26 నుంచి జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరికొండ బలరాం కోరారు. ఈమేరకు సోమవారం ఆలయం ఆవరణలో ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. మహాశివరాత్రి జాగరణ ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇందుకోసం భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 26న ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శివుడికి అభిషేకాలు, సాయంత్రం 7గంటలకు శివపార్వతుల కల్యాణం, రాత్రి 10 గంటల నుంచి 27న ఉదయం 5గంటల వరకు భజన, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆలయ ప్రాంగణంలో హనుమకొండకు చెందిన పెండ్యాల జయశ్రీ శిష్యబృందంచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శన, హైదరాబాద్‌కు చెందిన పొన్నం రాణాప్రతాప్‌చే బీట్ బాక్సింగ్ అనుకరణ, శివరోహిత్‌చే మిమిక్రీ ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గాదం కుమార్, కొత్తపల్లి బాబూరావు, గంగిశెట్టి రాజ్‌కుమార్, నేరెళ్ల శంకర్, దూడబోయిన రవి, ఓంప్రకాశ్, భూక్య జోహార్, కృష్ణాకర్‌రావు, రవిరెడ్డి, బల్గూరి నవీన్, సల్వాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

మహాశివరాత్రి వేడుకలు విజయవంతం చేయాలి ● అధికారులతో కలెక్టర్ దివాకర

వెంకటాపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల విజయవంతానికి జిల్లా అధి కారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ టీఎస్.ది వాకర ఆదేశించారు. మండలంలోని రామప్ప రామలిం గేశ్వరస్వామి ఆలయం ఆవరణలో చేపడుతున్న ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26నుంచి జరిగే జాతరను పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం తోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా ప్రత్యేక పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేశామని అన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపడు తున్నామని తెలిపారు. జాతరను పురస్కరించుకుని ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు., మూడురోజుల్లో 24 గంటలపాటు వైద్యసిబ్బంది సేవలందిస్తారని అన్నారు. జాగారణ చేసే భక్తుల కోసం రామప్ప పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయడం జరిగిందని, సాయంత్రం 5గంటల అనంతరం సరస్సు కట్టపైకి ఎవరిని అనుమతించొద్దని పోలీస్ అధికారులను ఆదేశించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం వాహన పార్కింగ్, మరుగుదొడ్ల ఏర్పాటుతోపాటు స్వచ్ఛమైన మంచినీరు అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటుచేసిన క్యూలైన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ రవీందర్, ఎండోమెంట్ ఈవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

రామప్ప ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా రామప్ప దేవాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఆలయ ముఖద్వారం, గర్భగుడి, కల్యాణ మండపం, తదితర ప్రాంతాల్లో ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మూడురోజులపాటు జరుగనున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా అభిషేకాలు, అర్చనలు, అగ్నిగుండాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు.

ఆలయాలు ముస్తాబు

మల్హర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచారంలోని మల్లన్నగుట్ట, కొయ్యూర్‌లోని నైనాగుళ్ల, పెద్దతూండ్లలోని హనుమాన్ సహిత శ్రీ మద్రాజరాజేశ్వరి పంచాయితన దేవాలయంతో పాటు తాడిచర్లలోని హనుమాన్ సహిత శివపంచాయతన ఆలయంలో శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధమైంది. మల్లన్నగుట్టపై మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. కొయ్యూర్, పెద్దతూండ్ల, తాడిచర్లలోని ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా శివ కల్యాణం నిర్వహించనున్నారు.

అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సమ్మక్క



ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ములుగుకు చెందిన కె.సమ్మక్క ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని యూని యన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో సభ్యులందరూ సమ్మక్కను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సమ్మక్క మాటా ్డుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

సున్నంబట్టి వీధిలో చోరీ

వెంకటాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సున్నంబట్టివీధిలోని ఓ ఇంట్లో సోమవారం చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీధిలోని కృష్ణ అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న నల్లపూసల గొలుసు, బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు చోరీ చేసినట్లు తెలిపారు. కాగా, కృష్ణ కుటుంబసభ్యులు నాలుగురోజుల క్రితం ఊరెళ్లారని, ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగతనం జరిగిందని తెలిపారు. కాగా, ఈవిషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని వినతి

వెంకటాపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సోమవారం బహుజన సమాజ్‌వాది పార్టీ మండల అధ్యక్షుడు గణేష్ ఆధ్వర్యంలో నాయకులు డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గణేష్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పంటలు సాగుచేస్తే దిగుబడులు తగ్గాయని, గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

కూలీల వివరాలు పోలీసులకు తెలపాలి

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులు పంట కోత కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకొచ్చే గొత్తికోయ కూలీల వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని ఎస్సై ఇనిగాల వెంకటేశ్ అన్నారు. ఏటూరునాగారం-తుపాకులగూడెం ప్రధాన రహదారిపై ఆయన సోమవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. పనులు ముగించుకొని వెళ్తున్న గొత్తికోయ కూలీలకు, రైతులకు ఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరి ఆధార్ కార్డులను పరిశీలించారు. వ్యక్తిగత వివరాలు అడిగి తెలుసు కున్నారు.

సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టుల నిరసన

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీడబ్ల్యూఎఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు పిట్టల మధుసూదన్ ఆధ్వర్యంలో జిల్లాలోని జర్నలిస్టులు సోమవారం కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా మధు సూదన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగా పాత్రికేయుల సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకుముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ దాటవేత ధోరణిని అవలంబిస్తోందని అన్నారు. ఇళ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలని సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రివ్యూ పిటిషన్ దాఖలుచేసి జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఈవో అల్లం రాజ్‌కుమార్‌కు అందజేశారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.షఫీ, నాయకులు జాలిగపు కిరణ్, భూక్య సునీల్, నర్రా రఘువీర్, సామ బుచ్చిరెడ్డి, ఆవుల వెంకన్న, ఎమ్డీ.రఫి, గజ్జి రాజేష్, నాగపురి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

మంగపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మంగపేట- బోరునర్సాపురం మధ్యలో గౌరారం వాగు ఒడ్డున మిర్చి నారుమళ్ల ఇసుక దిబ్బల ప్రాంతంలో వెలిసియున్న శ్రీ కనుకదుర్గమ్మ ఆలయ ఆధునికీకరణకు పలువురు విరాళాలు అందించారు. మంగపేటకు చెందిన జవంగుల రవీంద్ర- నాగ సరిత దంపతులు రూ. 5 వేలు, చెట్టి భాస్కర్-ప్రవళిక దంతపులు రూ. 10 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారి వేణుగౌడ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనకు ముహూర్తం ఖరారు



అర్చకులకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వై-జంక్షన్ వద్ద నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను సోమవారం ఆవిష్కరించారు. హనుమకొండలోని భద్రకాళీ దేవస్థానం అర్చకులు రామకృష్ణ ఆధ్వర్యంలో ఏప్రిల్ 16న (బుధవారం) ఉదయం 11:08 గంటలకు అనురాధ నక్షత్ర యుక్త మిధన లగ్న పుష్కరాంశ సుముహూర్తాన విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు అర్చకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొలుసాని గౌరీ శంకర్, ఆలయ ఉపాధ్యక్షులు అల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బోడ సత్యం, కోశాధికారి పర్వతాల లాలయ్య, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, శివాలయం కమిటీ మాజీ చైర్మన్ తాడూరి రఘు, కమిటీ సభ్యులు నూక ప్రభాకర్, వసంత రమేష్, బచ్చు సత్యనారాయణ, పాలకుర్తి పాపన్న, మోడెం రమేష్, అజ్మీరా సమ్మయ్య, వంగరి గోపి, గద్దె బయకృష్ణ, చింత సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

చిట్యాల, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పరిజ్ఞానం (సీఈఐఆర్)తో పోగొట్టుకున్న ఫోన్లను వెతికి పట్టుకోవడంలో చిట్యాల పోలీసులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన గోల్కొండ సతీష్, చల్లగరిగ గ్రామానికి చెందిన బరన్‌రెడ్డి ఇటీవల తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈమేరకు స్థానిక పోలీసులను ఆశ్రయించి సీఈఐఆర్ పద్ధతిలో పిర్యాదు చేశారు. కాగా సీఐ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్ బాధితులను సోమవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఫోన్లను స్వయంగా అందజేశారు. సెల్‌ఫోన్లను గుర్తించడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ లాల్‌సింగ్‌లను అభినందించారు.

శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్సీ కవిత



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ కవిత

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సోమవారం రాత్రి వచ్చారు. భూపాలపల్లిలోని 30వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ మాడ కమల- లక్ష్మారెడ్డిల తనయుడు, తెంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి-ప్రత్యూషరెడ్డి వివాహ రిసెప్షన్‌కు హ ఆజరయ్యారు.ఆమె వెంట స్థానిక మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి : మునిసిపల్ కమిషనర్



పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్ శ్రీనివాస్

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇంటి పన్నులు, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని భూపాలపల్లి మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ కోరారు. భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇంటి పన్నులు దగ్గరుండి వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు వచ్చే అధికారులు, సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పట్టణాన్ని రాష్ట్రంలోనే వంద శాతం పన్నుల వసూళ్లలో ఉంచాలనే ధృడసంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాసర్, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతిపై కేసు నమోదు

టేకుమట్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయినపల్లి గ్రామానికి చెందిన సోరూపాక వీరమ్మ (66) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా ఆమె కుమారుడు రాజయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తల్లి వీరమ్మ ఇంటి నుంచి వెళ్లినప్పుడు ఒంటిపై బంగారం, వెండి ఉందని, బావిలో శవమై లభ్యమైన తర్వాత అవి కనిపించలేదని పేర్కొన్నాడు. చేతులు వెనక్కి కట్టి ఉంచి, తలపై గొనె సంచి కప్పి ఉందని, ఆమె మృతిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదు చేసినట్టు సీఐ మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

కాటారం సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపం

కాటారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో సోమవారం సాంకేతికలోపం తలెత్తింది. దీంతో వ్యవసాయ విద్యుత్‌కు నాలుగు గంటల పాటు అంతరాయం కల్గింది. సబ్‌స్టేషన్‌లో వల్లెంకుంట బ్రేకర్‌లో టెక్నికల్ ప్రాబ్లెం రావడంతో తాడిచర్ల ఫీడర్‌లో సింగిల్ ఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేశారు. విద్యుత్ సాంకేతిక సమస్య విషయం తెలిసి ఎస్‌ఈ మల్హార్ సబ్‌స్టేషన్‌క్ వచ్చి దగ్గరుండి రిపేర్ చేయించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది మూడున్నర గంటల పాటు నిరంతరాయంగా శ్రమించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. మండలకేంద్రంలో విద్యుత్ గంటల పాటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో డీఈఈ పాపిరెడ్డి, ఏడీఈ నాగరాజు, ఏఈ ఉపేందర్, ఆపరేషన్స్ మెయింటెనెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కోలాహలం

మహదేవపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం ఏకాదశిని పురస్కరించుకుని త్రివేణి సంగమ గోదావరిలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. శివసత్తుల పూనకాలు, డోలువాయిద్యాలతో గోదావరి ప్రాంగణం దద్దరిల్లింది. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామికి మహారుద్రాభిషేకం, బిల్వార్చన ప్రత్యేక పూజలు చేశారు. శుభానందదేవి ఆలయంలో కుంకుమ పూజలు, సరస్వతిదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, బక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా పట్టు వస్త్రాలను సమర్పించారు. సోమవారం ఒక్కరోజే 40 వేల మంది భక్తులు తరలివచ్చినట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ జిల్లాల నుంచి తండోప తండాలుగా కాళేశ్వరానికి తరలివచ్చి పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు.



కాళేశ్వరం ఆలయంలో భక్తులు



ఆలయం ఎదుట నిద్రిస్తున్న భక్తులు

ఆలయం ఎదుట భక్తుల నిద్ర

కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని వందలాది మంది భక్తులు దర్శించుకుంటుంటున్నారు. త్రివేణి సంగమ గోదావరి వద్దకు చాలా మంది వచ్చి అస్థికల పూజలు, పిండ ప్రదానం చేయిస్తుంటారు. అయితే.. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇక్కడ వసతి అంతంతమాత్రమే ఉంది. రూములు ఉన్నప్పటికీ దేవాదాయ శాఖ అధికారులు భక్తులకు కేటాయించకుండా ఇబ్బందులు పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. తాము బస చేయడానికి రూములు లేకపోవడంతో పిల్లాపాపాలతో ఆలయం ఎదుటే చలిలో వణుకుతూ నిద్ర పోతున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది సంవత్సరాల క్రితం భక్తుల కోసం అప్పటి ప్రభుత్వం వంద రూముల వసతి గృహాలను కట్టగా ఇప్పటికీ అవి అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో భక్తులు చేసేదేమీ లేక ఆలయం ఎదుటే బస చేస్తున్నారు. కొందరు భక్తులను వసతి గృహాల్లో పనిచేసే సిబ్బంది ప్రైవేటు గెస్ట్ హౌస్‌లకు పంపిస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని టోకరా

ఒక్కొక్కరి వద్ద రూ.2.50 లక్షలు వసూలు

8 మందికి మొత్తం రూ.20 లక్షల కుచ్చు టోపీ



రాహుల్ అరెస్టును చూపుతున్న సీఐ మహేందర్

గీసుగొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 8మంది నిరుద్యోగుల వద్ద రూ.20 లక్షలను వసూలు చేసిన మోసగాడిని గీసుగొండ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ మేరకు గీసుగొండ సీఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ జిల్లా హనుమాన్ నగర్‌కు చెందిన హరిగొప్పుల రాహుల్ హైదరాబాద్‌లో నాచారం మల్లాపూర్‌లో గ్లోబల్ ఐటీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో హెచ్‌ఆర్ అడ్మిన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు వల పన్నాడు. ఈ క్రమంలో ప్రైవేటు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న గీసుగొండ మండలం ఎలుకుర్తి గ్రామానికి చెందిన పృథ్వీ, దీపక్‌లు రాహుల్‌కు పరిచయం అయ్యారు. వారికి ఉద్యోగం ఇప్పిస్తానని రాహుల్ నమ్మించి ఒక్కొక్కరి వద్ద రూ.2.5 లక్షల చొప్పున రూ.5 లక్షలు వసూలు చేశాడు. వారికి ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూ చేసినట్లు నటించి.. 2024 జనవరి 2వ తేదీన మాగ్నిక్యూ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినట్లు నకిలీ ఉద్యోగ పత్రాన్ని పృథ్వీ, దీపక్‌లకు అందించాడు. కంపెనీలో 6 నెలలు ట్రైనింగ్ ఉంటుందని, ఈ సమయంలో నెలకు రూ.20 వేలు ఇస్తారని, ట్రైనింగ్ అనంతరం రూ.40వేలు ఇస్తారని నమ్మబలికాడు. రాహుల్ మాయమాటలు నమ్మిన పృథ్వీ.. సమీప బంధువులకు, స్నేహితులకు చెప్పడంతో శాయంపేట మండలం అప్పయ్యపల్లి గ్రామానికి చెందిన ఎటుకాల పవన్‌కుమార్, కౌడగాని సాయిపవన్, కాంపెల్లి లక్ష్మారెడ్డి, భూపాలపల్లి మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన గుండగాని రాజు, టకిరే సాయికృష్ణ, మాణికరావు సాయికుమార్‌ల వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.2.5 లక్షలను రాహుల్ వసూలు చేశాడు. మొత్తం 8 మంది నిరుద్యోగుల వద్ద రూ.20 లక్షలు వసూలు చేసిన రాహుల్.. 4 నెలల తరువాత ఒక్క నెల రూ.20 వేల జీతం ఇచ్చి మిగిలినవి ఇవ్వలేదు. కంపెనీ మూసివేస్తున్నారని మీ డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి రాహుల్ తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధితులు గీసుగొండ, భూపాలపల్లి, ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లలో 2024 అక్టోబరు 10వ తేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన ఎస్సై ప్రశాంత్‌బాబు.. టేకుమట్ల మండలం వెల్లంపల్లి గ్రామంలో రాహుల్‌ను పట్టుకొని కోర్టులో హాజరుపరుచగా 14 రోజుల రిమాండ్‌కు పంపినట్లు సీఐ మహేందర్ తెలిపారు.

ఘనంగా శ్రీనుబాబు జన్మదిన వేడుకలు



కాటారంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కాటారం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి, ధాన్వాడలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు, శ్రీపాద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్ తదితరుల ఆధ్వర్యంలో 52 కిలోల కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ధన్వాడలో దత్తాత్రేయస్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, నాయకులు రాజేందర్, దేవేందర్‌రెడ్డి, నాయిని శ్రీనివాస్, అశోక్, రవీందర్‌రావు, మజీద్, రవికుమార్, లచ్చిరెడ్డి, శ్రీహరి, తిరుపతిరెడ్డి, సంపత్, జాడి రమేష్, కొట్టె ప్రభాకర్, రమేష్‌రెడ్డి, ఊంసింగ్, వెంకట్‌రెడ్డి, రఘు, కుమార్, విక్రమ్, రాజు, శ్రీకాంత్ రాజునాయక్, అజీజ్, సమ్మిరెడ్డి, రఘు తదితరులు ఉన్నారు.

● మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం క్రాంతి ఆధ్వర్యంలో దుద్దిళ్ల శ్రీనుబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షడు దండు రమేష్, పీఏసీఎస్ చైర్మన్ మొండయ్య, వైస్ చైర్మెన్ ప్రకాష్‌రావు, మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత రాజిరెడ్డి, గడ్డం క్రాంతి, మాజీ జడ్పీటీసీ కొండ రాజమ్మ, మండల రాహుల్, ఇందారపు చంద్రయ్య, బొబ్బిలి రాజు, కుంట సదానందం, సపేంధర్, ఉదయ్ పాల్గొన్నారు.

● మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దుద్దిళ్ల శ్రీనుబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ వంశీరాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పక్కల సడువలి, నాయకులు నజీర్‌ఖాన్, రాజమల్లుగౌడ్, మోత్కూరి రవి, సుగుణాకర్‌రావు, లచ్చయ్య, రాజు, తిరుపతి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలి

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



మాట్లాడుతున్న నర్సిరెడ్డి

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగబోయే వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి ఈసారి కూడా గెలిపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో జరిగిన ఎన్నికల్లో తనను గెలిపించారని, అందుకు గాను నిత్యం ఉపాధ్యాయుల, అధ్యాపకుల గొంతుకగా ఉంటూ సమస్యలన్నింటిపై శాసన మండలిలో ప్రశ్నించానని గుర్తు చేశారు. మొదటి పీఆర్సీ ఆలస్యమవుతున్న సందర్భంలో 2020 మార్చి 5న ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేశానన్నారు. 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాల్సిందేనని ప్రస్తావించి దాంతోపాటు పీఆర్సీ సాధనలో కృషి చేసానన్నారు. అలాగే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ 30 శాతం వేతనాలు పెంచడానికి చొరవ చూపానన్నారు. ఇంకా పరిష్కారం చేయాల్సిన సమస్యలు చాలా ఉన్నాయన్నారు. 2023 డీఎస్సీ ఉపాధ్యాయులు సహా సెప్టెంబరు 2004 నుంచి ఉద్యోగాలలోకి వచ్చిన ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్ అమలు చేయించాల్సి ఉందన్నారు. మండల విద్యాధి కారులు, ఉప విద్యాధికారులు, డైట్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ పోస్టులలో ప్రమోషన్స్ అమలు చేయించేలా చూడాలన్నారు. ఇలాంటి అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని, మరోమారు తనకు అవకాశం కల్పిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.